సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 24 । జూలై । 2023



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తెలిదేవర నాగ శ్రీవత్స (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



భక్త మహాశయులకు...

రత్నగిరికి మెట్ల మార్గంలో వచ్చే సత్యదేవుని భక్తుల కోసం వనదుర్గ ఆలయం ఎదురుగా రూ.2 కోట్లతో విశ్రాంతి భవన నిర్మాణం చకచకా జరుగుతోంది. - 8లో▸

భారీ వాహనాలకు నో ఎంట్రీ



రాజమహేంద్రవరం - కొవ్వూరు మధ్య ఉన్న రోడ్ కం రైలు వంతెనపై ఆదివారం నుంచి లారీలు, బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. - 8లో▸

న్యూస్‌రీల్

థ్యాంక్యూ సీఎం సార్..



సీఎం జగన్, మంత్రి విశ్వరూప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న చేనేత సంఘ సభ్యులు

అమలాపురం రూరల్: నేతన్న నేస్తం పథకంతో తమ జీవితాలకు వెలుగులు తెచ్చారంటూ చేనేతలు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బండారులంకలో నేతన్న నేస్తం పథకం కింద 750 మందికి రూ.24 వేల చొప్పున ఆర్థిక లబ్ధి అందించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విశ్వరూప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ చేనేత కార్మికులకు వరుసగా ఐదోసారి నేతన్న నేస్తం పథకం అమలు చేసి ఆదుకున్నారన్నారు. బండారులంక చేనేత సొసైటీ అధ్యక్షుడు చింతా ఉమామహేశ్వరరావు, చేనేత సంఘ నాయకులు చందన శంకర్రావు, జాన గణేష్, అంకం పెదరాజు, సరెళ్ల రామకృష్ణ, పెదపూడి బాబూరావు, కాశిన చిట్టిరాజు పాల్గొన్నారు.


విజయములివ్వు విఘ్నేశ్వరా..



అయినవిల్లి ఆలయంలో గణపతి హోమ పూజల్లో భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయమే ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో భక్త దంపతులు పాల్గొని పూజలు చేశారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 69 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 383 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 22 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 34 మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం వంటివి నిర్వహించారు. ఐదుగురు తలనీలాలు సమర్పించారు. 25 మంది నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.1,51,038 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

బాలాజీ స్వామి ఆలయానికి రూ.1.14 లక్షల ఆదాయం



మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.1.14 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.73,270 రాగా, నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.40,901 విరాళంగా సమర్పించారు. 2,364 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 1,870 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన శ్రీరామ్ నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.11,111 విరాళం ఇచ్చారు.

మహిళలు, బాలికల రక్షణకు విధులు

అమలాపురం టౌన్: మహిళా సంరక్షణ కార్యదర్శులుగా పని చేస్తున్న మహిళా పోలీసులు ఇక నుంచి కేవలం తమ సచివాలయాల పరిధిలోని మహిళలు, బాలికల రక్షణ కోసమే పనిచేయాల్సి ఉంటుంది. వారిని సివిల్ పోలీసు విధులకు పంపించకుండా సచివాలయ ప్రాంతాల్లో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తిస్తూ, వాటి పరిష్కారానికి ఇతర శాఖల సమన్వయంతో పని చేయించాలని రాష్ట్ర పోలీసు శాఖ ఈ నెల 21న ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 515 వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీసుల విధులు ఆ దిశగా ఉండాలని ఎస్పీ కార్యాలయం నుంచి అన్ని పోలీసు స్టేషన్లకు ఆదేశాలు వచ్చాయి. పోలీసు సాధారణ విధులు బందోబస్తు, రిసెప్షన్, శాంతి భద్రతలు వంటి విధులకు ఇప్పటి వరకూ మహిళా పోలీసులను ఉపయోగించారు. ఇక నుంచి తమ సచివాలయాల పరిధిలోని మహిళలు, బాలికలకు మాత్రమే సేవలు అందించనున్నారు.

ప్రతి నెలా రెండుసార్లు వైద్యం



ఈమె పేరు కుడుపూడి మంగతాయారు. మామిడికుదురు మండలం బి.దొడ్డవరం గ్రామానికి చెందిన ఈమె బీపీ, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తమ గ్రామానికి ప్రతి నెలా రెండుసార్లు 104 వాహనం వచ్చి, వైద్య సేవలందిస్తోందని, తన సమస్యలను డాక్టర్‌కు చెప్పి సలహాలు, సూచనలు తీసుకుంటున్నానని, ఉచితంగా మందులు కూడా ఇస్తున్నారని ఆమె చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఈయన పేరు పెయ్యిల భాగరాజు. ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలేనికి చెందిన ఈయన రెండేళ్ల కిందట ప్రమాదానికి గురయ్యారు. తర్వాత పక్షవాతానికి లోనై మంచానికే పరిమితమయ్యారు. అతనికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్యం అందుతోంది. డాక్టర్లు ఇంటికి వచ్చి, భాగరాజు ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి, నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నారు. అంతేకాకుండా క్షేత్ర స్థాయిలో హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం నిత్యం పర్యవేక్షిస్తున్నారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటి ముంగిట్లోనే నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సరిపడా మందులు ఇచ్చి..



రావులపాలేనికి చెందిన ఈమె పేరు మాగాపు దుర్గ. భర్తకు ఆరు నెలల కిందట పక్షవాతం వచ్చింది. మంచం పైనే ఉంటున్నారు. ఆయనను ఆమె ఒక్కరే ఆస్పత్రికి తీసుకు వెళ్లలేని పరిస్థితి. ఇటువంటప్పుడు ఈమెకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఎంతో అక్కరకు వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ప్రతి 15 రోజులకు ఒకసారి ఇంటికి వస్తున్నారు. దుర్గ భర్తకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి, నెల రోజులకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నారు. పేద, మధ్య తరగతి వారికి ఈ ప్రభుత్వం ఎంతో చక్కగా వైద్య సేవలు అందిస్తోందని దుర్గ అన్నారు.

శీఘ్రమేవ ఆరోగ్య ప్రాప్తిరస్తు

ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రతి వ్యక్తికీ ఇదే అవసరం.. అలాంటి ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలు మహోన్నతం.. వైద్య రంగంలో చేపట్టిన సంస్కరణలే అందుకు నిదర్శనం.. ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పల్లె ముంగిటకు వైద్యం చేరింది.. ఆధునిక సదుపాయాలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో అది సాధ్యమవుతోంది. దీంతో పాటు 'ఫ్యామిలీ డాక్టర్' విధానంతో ప్రజల ఇంటి ముంగిటనే వైద్యం అందుతోంది. ఏదైనా అనారోగ్యం బారిన పడితే సామాన్యులు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వద్దకు పరుగులు పెట్టే అవస్థ తప్పింది.



ఆత్రేయపురంలో ఇంటి వద్ద వైద్య సేవలు అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్, సిబ్బంది

- నట్టింటికొచ్చి.. నాడి పట్టి..
- ఇంటి ముంగిటకే 'ఫ్యామిలీ డాక్టర్లు'
- జిల్లాలో 109 మంది వైద్యుల సేవలు
- పల్లెల్లో అందుబాటులోకి హెల్త్ క్లినిక్‌లు
- పేదలకు దరిచేరిన వైద్యం

సాక్షి అమలాపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు గ్రామీణ ప్రాంత ప్రజలకు పీహెచ్‌సీలు, జిల్లాలో అక్కడక్కడా సీహెచ్‌సీలు మాత్రమే అందుబాటులో ఉండేవి. మండలానికి రెండు పీహెచ్‌సీలు ఉండగా, ఉప్పలగుప్తం వంటి మండలంలో మూడు పీహెచ్‌సీలు మాత్రమే ఉన్నాయి. చిన్న అనారోగ్యానికి సైతం అక్కడకు వెళ్లి వైద్యం సేవలు పొందాల్సి వచ్చేది. లేదంటే గ్రామాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీల వద్దకు పరుగులు తీయాల్సి ఉండేది. దీనిని గమనించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమూల మార్పులకు నిర్ణయించింది. పల్లెల్లో ప్రజలందరికీ ఇంటి ముంగిటే వైద్యం అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 296 హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 35 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం పూర్తి కాగా, 247 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇవి పూర్తయితే పీహెచ్‌సీల ద్వారా అందే సేవలన్నీ అందనున్నాయి.





కె.గంగవరం మండలం కుందూరులో ఇంటి వద్ద వైద్యం చేస్తూ..



మామిడికుదురు మండలం బి.దొడ్డవరంలో ఓపీ చూస్తున్న ఫ్యామిలీ డాక్టర్

మన ఇంటికొచ్చి.. మందులిచ్చి

ఫ్యామిలీ డాక్టర్ విధానం కోనసీమ జిల్లాలో సత్ఫలితాలను ఇస్తోంది. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. నేటి వరకూ గ్రామాల్లో వైద్య సేవలు నిర్విఘ్నంగా అందుతున్నాయి. జిల్లాలో 109 మంది వైద్యులు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. మొత్తం 46 పీహెచ్‌సీలలో పనిచేస్తున్న 99 మంది, డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న నలుగురు వైద్యులు, సీహెచ్‌సీలలో ఆరుగురు వైద్యులు సేవలందిస్తున్నారు. ప్రాథమిక చికిత్స నుంచి మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకూ ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నారు. మండల స్థాయిలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో ఇద్దరు డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, డీఈఓ, ఆశ కార్యకర్తలతో కూడిన వైద్య బృందం సేవలందిస్తుంది.

సేవలు.. మందులు

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో సాధారణ వైద్య సేవలతో పాటు బీపీ, షుగర్, గర్భిణులు, బాలింతలు, రక్త హీనత బాధితులకు ప్రత్యేక సేవలు అందిస్తున్నారు.

జూన్‌లో వైద్య సేవలు పొందిన వారు

జనరల్ ఓపీ	3,04,632
బాలింతలు	19,307
గర్భిణులు	11,737
గర్భిణులలో రక్తం తక్కువగా ఉన్నవారు	1,901
రక్తపోటు బాధితులు	1,16,933
మధుమేహ వ్యాధిగ్రస్తులు	70,142
రక్తపోటు, మధుమేహ బాధితులు	63,792

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ, మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రమాదాలు, పక్షవాతం, వివిధ కారణాలతో మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి చికిత్సతో పాటు మందులు అందజేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన రోగులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరాన్ని బట్టి 14 రకాల రక్త పరీక్షలు నిర్వహించడమే కాకుండా 105 రకాల మందులను రోగులకు అందిస్తున్నారు. పదేళ్ల నుంచి 19 ఏళ్ల మధ్యలో ఉన్న అబ్బాయిలు, అమ్మాయిలకు శరీరంలో వచ్చే మార్పులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొన్నటి వరకు 104 వాహనాలు 25 ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 36కు చేరింది. దీనివల్ల ఫ్యామిలీ డాక్టర్ సేవలు మరింత వేగవంతమయ్యాయి. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నెలకు మూడు లక్షల మందికి పైగా సేవలు పొందుతున్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



రోగాలతో బాధపడే సామాన్యులు, పేదలకు గ్రామంలోనే వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోంది. 109 మంది వైద్యుల ద్వారా గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నాం. 104 వాహనాల సంఖ్య కూడా పెరగడంతో మరింత మెరుగైన సేవలందుతున్నాయి. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–దుర్గారావు దొర, జిల్లా వైద్యాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అమలాపురం బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: అమలాపురం బాలయోగి స్టేడియంలో బుధవారం మహిళా సంఘాల సభ్యులకు సున్నా వడ్డీ పథకం నిధులు జమ చేసేందుకు ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో బాలయోగి స్టేడియంలో సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అధికారులతో కలిసి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ, పురపాలక సంఘ ఇంజినీర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం సీఎం బహిరంగ సభ స్టేజ్ పనులను పరిశీలించారు. సోమవారం సాయంత్రానికి అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. మంత్రి వెంట జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్ గోపాలరావు, గెడ్డం సంపదరావు, నాయకులు సరేళ్ల రామకృష్ణ, నక్కా చంద్రశేఖర్ ఉన్నారు.

పార్కింగ్ స్థలాల ఎంపికపై సమీక్ష

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న అమలాపురంలో నిర్వహించనున్న పర్యటన, బహిరంగ సభకు సంబంధించి పార్కింగ్ స్థలాల ఎంపికపై జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ పోలీసు, రెవెన్యూ అధికారులతో ఆదివారం సమీక్షించారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభ జరిగే అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో కేటగిరీల వారీగా పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసే విషయంపై ఆ ప్రాంతాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఎస్పీ శ్రీధర్‌తో పాటు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఆర్డీఓ వసంతరాయుడు, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌లు పార్కింగ్ స్థలాలను పరిశీలించి ఎంపిక చేశారు. సభకు వచ్చే వాహనాలకు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బాలయోగి స్టేడియం, అయినవిల్లి రోడ్డు, కిమ్స్ వైద్య కళాశాలకు వెళ్లే రోడ్లను అధికారుల బృందం పరిశీలించింది.

'అల్ట్రా పల్లె వెలుగు'కు రైట్ రైట్

- ప్రారంభించిన మంత్రి పినిపే విశ్వరూప్
- రూ.1.34 కోట్లతో అమలాపురం ఆర్టీసీ డిపో ఆధునీకరణ
- ఈ నెలాఖరుకు టెండర్లు, ఆగస్టులో పనులు



అల్ట్రా పల్లె వెలుగు బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: ప్రగతి రథ చక్రాలు పల్లె వాకిట పరుగులు తియ్యనున్నాయని, తద్వారా ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ అన్నారు. ఆదివారం అమలాపురం ఆర్టీసీ బస్ డిపోలో కొత్తగా లీజు పద్ధతిలో తీసుకున్న ఆరు అల్ట్రా పల్లె వెలుగు బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ఆరు బస్సుల్లో నాలుగు అమలాపురం- కాకినాడ మధ్యలో నడుస్తాయని, రెండు అమలాపురం- రాజమహేంద్రవరం మార్గంలో వెళ్తాయన్నారు. త్వరలో మరో ఆరు సర్వీసులను అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు. త్వరలోనే అమలాపురం నుంచి ముఖ్యమైన ప్రాంతాలకు ఏసీ స్లీపర్ బస్సులు నడుపుతామని మంత్రి తెలిపారు.అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆధునీకరించాలని ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకువెళ్లగా తొలి విడుతలో రూ.1.34 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చారని అన్నారు. దీనికి సంబంధించి ఈ నెలాఖరుకు టెండర్లు పూర్తి చేసి, ఆగస్టు నుంచి ఆధునీకరణ పనులు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రెండు ఫేజ్‌లలో అన్ని హంగులతో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను తీర్చిదిద్దుతామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ పరం చేశామన్నారు. ఆర్టీసీ కార్మికులకూ హయ్యర్ పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ విశ్రాంత కార్మికులకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకూ పెన్షన్ వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

అడ్డొచ్చే కొమ్మలే తొలగించారు..

ఈ నెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలాపురం పర్యటన ఖరారైన నేపథ్యంలో భద్రతా కారణాలతో కాన్వాయ్‌కు అడ్డువచ్చే చెట్ల కొమ్మలు మాత్రమే తొలగించామని, ఎక్కడా పూర్తిగా చెట్లను నరకలేదని మంత్రి విశ్వరూప్ స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఐదెకరాల పోలీసు క్వార్టర్స్ స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కిమ్స్‌లో హెలిప్యాడ్‌కు అనుకూలంగా లేదని వివరించారు. సీఎం జగన్ అమలాపురం వస్తున్నారని కోనసీమ ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం జగన్‌కు భారీ స్థాయిలో స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్టీసీ ఆర్ఎం ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, జిల్లా బీసీసెల్ కార్యదర్శి మట్టపర్తి నాగేంద్ర, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

మంత్రి వేణుగోపాలకృష్ణ



ఎంపీపీ అంబటి భవానీకి కేక్ తినిపిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. వేణుగోపాలకృష్ణ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడు వసంతాలు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయ ఫంక్షన్ హాల్ వద్ద ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి మంత్రి అందరికీ పంచారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ మనమంతా వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పని చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమమే యజ్ఞంగా భావించి సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని, ఇందులో మనమంతా భాగస్వాములు కావాలన్నారు. మంత్రిగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి వేణు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మూడేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేసే విధంగా కృషి చేశానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో సమూల మార్పులు చేసిందన్నారు. తద్వారా గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని తీసుకు వచ్చిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలకు దిగుతున్నాయని మంత్రి వేణు అన్నారు. రాబోయే కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉంటారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీపీలు అంబటి భవానీ, పంపన పద్మావతి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతూ.. ఆపై పెరుగుతూ..

గోదావరి వరద దోబూచులాట



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

సాక్షి అమలాపురం: గోదావరి వరద దోబూచులాట ఆడుతోంది. భద్రాచలంలో వరద పెరిగినట్టే పెరిగి.. ఆదివారం మధ్యాహ్నం నుంచి తగ్గుతుండగా, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉదయం తగ్గి మధ్యాహ్నం నుంచి పెరుగుతోంది. ఈ ప్రభావం కోనసీమ జిల్లాపై పడుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉదయం ఆరు గంటలకు వరద నీటి విడుదల 7.96 లక్షల క్యూసెక్కుల వరకూ ఉండగా, పది గంటలకు 8.09 లక్షల క్యూసెక్కులు, మధ్యాహ్నం ఒంటి గంటకు 8.21 లక్షలకు పెరిగింది. సాయంత్రం ఏడు గంటలకు ఇది కాస్తా 8.51 లక్షల క్యూసెక్కులకు చేరింది. ఇదే సమయంలో భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడం విశేషం. అయినప్పటికీ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద, కోనసీమ జిల్లాలో మరో ఎనిమిది నుంచి 15 గంటల వరకూ వరద ఉధృతి నెమ్మదిగా పెరుగుతూనే ఉంటోంది. ప్రస్తుత వరదలతో జిల్లాలోని లంక గ్రామాలకు పెద్దగా ఇబ్బంది లేదు. గోదావరి మధ్య ఉన్న లంకల్లో ఉన్న ప్రజలు మాత్రమే పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పి.గన్నవరం, అయినవిల్లి, మామిడికుదురు, ముమ్మిడివరం మండలాల్లోని లంకల మధ్య ఉన్న ప్రాంతాల నుంచి పశువులను ఇప్పటికే ఎగువ ప్రాంతాలకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వేపై వరద ఉధృతి తగ్గినా, స్వల్పంగా పెరిగే అవకాశముంది. పి.గన్నవరం శివారు కనకాయలంక కాజ్‌వేపై నీరు పారుతోంది.

నేడు ఓరియంటేషన్ ప్రోగ్రామ్

రాయవరం: పాఠశాల సముదాయ సమావేశాలపై సోమవారం ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం నుంచి ఉదయం 11 గంటలకు ఈ ఆన్‌లైన్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఉంటుంది. ఈ శిక్షణకు జిల్లా విద్యాశాఖాధికారులు, డైట్ ప్రిన్సిపాల్, సమగ్ర శిక్షా ఏఎంవోలు, మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఎంఆర్టీలు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా ఎలా నిర్వహించాలనే అంశాలపై అవగాహన కల్పిస్తారు.

రెండో బ్యాచ్‌కు శిక్షణ : హెచ్ఎంలకు వృత్యంతర శిక్షణలో భాగంగా లీడర్‌షిప్ క్వాలిటీపై రెండో బ్యాచ్‌కు సోమవారం నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఈ నెల 18 నుంచి 23 వరకూ గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇస్తున్నారు. జిల్లా నుంచి మొదటి బ్యాచ్‌లో 60 మంది శిక్షణ పొందగా రెండో బ్యాచ్‌లో 65 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. సోమవారం నుంచి రెండో బ్యాచ్‌కు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు.

యథావిధిగా నేడు 'స్పందన'

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి, తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులంతా సోమవారం ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని, గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉత్తమ కంద రైతుగా ప్రసాద్



కంద సాగులో ఉత్తమ అవార్డు అందుకుంటున్న ప్రసాద్

ఆత్రేయపురం: వద్దిపర్రు గ్రామానికి చెందిన జుజ్జవరపు ప్రసాద్‌కు కంద సాగులో ఉత్తమ పురస్కారం దక్కింది. కేరళ రాష్ట్రం తిరువంతపురంలో ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఉత్తమ రైతులకు సదస్సు జరిగింది. కంద సాగులో ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఆయనకు ఈ సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు. ప్రసాద్ వద్దిపర్రు పరిసర ప్రాంతాల్లో సుమారు 80 ఎకరాల్లో కంద సాగు చేస్తున్నారు. అవార్డు రావడం పట్ల పలువురు ఆయన్ని అభినందించారు.

క్లుప్తంగా

సముద్రంలో బాలుడి గల్లంతు


పార్థు

కొత్తపల్లి: సముద్రంలో ఓ బాలుడు గల్లంతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సామర్లకోట మండలం వేమవరం గ్రామానికి చెందిన పసుపులేటి వీర ప్రభాకరరావు తన కుటుంబ సభ్యులతో కలసి తుని రూరల్ లోవలోని తలపులమ్మ తల్లి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తూ మండలంలోని పొన్నాడ శివారు కోపపాపపేట ఎన్ఎస్ఆర్ హేచరీ ఎదురుగా ఉన్న తీర ప్రాంతంలో కుటుంబ సభ్యులతో దిగారు. కొంతసేపు కెరటాలలో అంతా కేరింతలు కొట్టారు. అనంతరం ఆటో ఎక్కిన తరువాత వీరప్రభాకరరావు రెండో కుమారుడు పసుపులేటి పార్థు కమలచక్రి (9) కనిపించకపోవడంతో సముద్రంలో గల్లంతైనట్లు గుర్తించారు. బాలుడి ఆచూకీ కోసం మత్స్యకారులు గాలింపు చేపట్టారు. పోలీసులకు సమాచారం అందించడంతో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి వీరప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పార్థు కాకినాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు.

ఆవులను ఢీకొట్టి బోల్తా పడిన లారీ


ప్రమాదంలో మృతి చెందిన ఆవు

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున ఆదివారం ఉదయం అదుపుతప్పిన ఓ లారీ రెండు ఆవులను ఢీకొని బోల్తా పడింది. ఆ వివరాల ప్రకారం.. ముమ్మిడివరం నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు కొబ్బరికాయల లోడుతో వెళుతున్న లారీ వీరలంకపల్లికి వచ్చేసరికి అదుపు తప్పింది. ఈ నేపథ్యంలో రెండు ఆవులను ఢీకొట్టి కొంత దూరం వెళ్లి బోల్తా పడింది. ఈ సమయంలో డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయట పడగా, ఒంగోలు జాతికి చెందిన రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ సుమారు రూ.1.80 లక్షలు ఉంటుందని రైతు కొరిపల్లి అప్పలస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే మృతి చెందిన ఆవులకు పశు వైద్యాధికారి పంచనామా నిర్వహించారు.


బోల్తా పడిన లారీ

భక్త మహాశయులకు...

- అన్నవరం దేవస్థానం సౌకర్యాలు
- నడక దారిలో డార్మెట్రీ నిర్మాణం
- 90 శాతం పూర్తయిన పనులు
- రూ.రెండు కోట్లతో భక్తుల వసతికి ఏర్పాట్లు


వనదుర్గ ఆలయం వద్ద సిద్ధమవుతున్న విశ్రాంతి భవనం

అన్నవరం: ఆధ్యాత్మిక చింతనతో.. మది నిండా భక్తిభావంతో.. ఆ స్వామివారిని స్మరిస్తూ రత్నగిరికి కాలినడక వచ్చే భక్త మహాశయులకు సౌకర్యాలు ఒనగూరుతున్నాయి.. మెట్ల మార్గం నుంచి అలసి సొలసి వచ్చేవారి కోసం విశ్రాంతి భవనం (డార్మెట్రీ) సకల హంగులతో రూపుదిద్దుకుంటోంది.. రత్నగిరిపై వనదుర్గ ఆలయం ఎదురుగా రూ.రెండు కోట్లతో దాత పెన్నాడ వెంకట రాజామణి సారథ్యంలో భక్తుల విశ్రాంతి భవన నిర్మాణం జరుగుతోంది. ఇది ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి కానుంది. గత ఏడాది ఆగస్టులో పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఆగస్టు నెలాఖరుకు మిగిలిన పనులు పూర్తి చేసి డార్మెట్రీని దేవస్థానానికి అప్పగించాలని దాత నిర్ణయించారు. డార్మెట్రీని దేవస్థానానికి అప్పగించిన వెంటనే ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈఓ చంద్రశేఖర్ అజాద్ వివరించారు.

అలా పునాది పడి..

రత్నగిరి సత్యదేవుని దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇందులో చాలామంది మెట్ల దారి నుంచి వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. అలాంటి వారికోసం డార్మెట్రీ నిర్మించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. బాత్‌రూమ్‌లలో స్నానం చేసి, తమ వస్తువులను అక్కడే లాకర్లలో భద్రపరుచుకునేందుకు శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఈ భవనం చేపట్టాలని భావించారు. ఈ సమయంలోనే రాజమహేంద్రవరానికి చెందిన దాత పెన్నాడ వెంకట రాజామణి డార్మెట్రీ నిర్మించడానికి ముందుకు వచ్చారు. అప్పటి ఈఓ వి.త్రినాథరావు శ్రీవనదుర్గ ఆలయం వద్ద ఉన్న పాత భవనాన్ని కూల్చి వేసి ఆ స్థలాన్ని దాతకు అప్పగించారు. ఈ నిర్మాణానికి గత ఏడాది ఆగస్టు 13న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ భూమిపూజ చేశారు.

ఆగస్టు నెలాఖరుకు సిద్ధం



సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాత రాజామణి డార్మెట్రీ నిర్మిస్తున్నారు. అనుకున్న సమయానికన్నా పనులు వేగంగా చేస్తున్నారు. ఆగస్టు నెలాఖరుకు దీనిని పూర్తి చేసి దేవస్థానానికి అప్పగిస్తామని చెప్పారు. మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధి, దేవదాయశాఖ ఉన్నతాధికారులతో కలసి ప్రారంభోత్సవ తేదీ ఖరారు చేస్తాం.

–చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం


భక్తుల విశ్రాంతి భవనం చిత్రాన్ని విడుదల చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత, దాత రాజామణి (ఫైల్)

వేయి మంది సేద తీరేలా..

మొత్తం 3,900 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తులలో ఈ భవనం నిర్మిస్తున్నారు. ఏకకాలంలో సుమారు వేయి మంది సేదతీరే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. మూడు అంతస్తుల లోనూ టాయిలెట్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల భక్తులు కొండపై వసతి గదుల కోసం ప్రయత్నించకుండా ఇక్కడే స్నానం చేసి స్వామివారిని దర్శనానికి రావొచ్చని అధికారులు తెలిపారు. ఈ పనులు ప్రారంభించిన మూడు నెలలకే పునాదుల దశ పూర్తి చేయగా, ఏప్రిల్ నెలలోనే మూడు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి వెలుపల ప్లాస్టింగ్, టైల్స్ అతికించడం పనులు చేస్తున్నారు. టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్తు సరఫరా పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని నిర్మాణ కాంట్రాక్టర్ అబ్బులు తెలిపారు.

మహా ప్రసాదం స్వామీ..


భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

అన్నవరం: సత్యదేవుని దర్శనం అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరిస్తే ఆ భాగ్యమే వేరు.. అన్నవరం రత్నగిరిపై సత్యదేవుని దర్బారు మండపం విశాలంగా తయారు చేసిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ సజావుగా సాగుతోంది. ఉదయం 8 నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ పంపిణీ చేస్తుండడంతో సంతృప్తి చెందుతున్నారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలతో దర్బారు మండపం ముందు ఉన్న గోడలు తీసేయడంతో విశాలమైన మండపం ఏర్పాటైంది. అక్కడ క్యూ ఏర్పాటు చేసి రెండు వైపులా తీర్థంతో పాటు పులిహోర ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేశారు. దీనివల్ల తొక్కిసలాట లేకుండా ప్రసాదాల పంపిణీ జరుగుతోంది. గతంలో సత్యదేవుని దర్బారు మండపంలో కేవలం 25 కిలోల బియ్యంతో చేసిన పులిహోర పంపిణీ చేసేవారు. మధ్యాహ్నం 12 గంటలకే పులిహోర అయిపోయేది. దశమి, ఏకాదశి, శనివారం, ఆదివారం తదితర రోజుల్లో ఉదయం పది గంటలకే ప్రసాదాల పంపిణీ ముగిసేది. దీంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేసేవారు. ప్రస్తుతం 60 కిలోల బియ్యంతో పులిహోర తయారు చేసి పంపిణీ చేయాలని, అవసరమైతే ఎక్కువ తయారు చేయించాలని ఈఓ ఆదేశించారు. గతంలో సరైన క్యూ లేక భక్తులంతా ఒకేసారి మీద పడిపోతుంటే తీర్థ ప్రసాదాలిచ్చే అర్చక స్వాములకు ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు రెండు చోట్ల పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేయడంతో ఆ ఇబ్బంది తప్పింది.

ప్రియురాలిని హత్య చేసింది ప్రియుడే!

- నిందితుడు నాగబాబు, సహకరించిన నరసింహం అరెస్ట్
- హత్య కేసును ఛేదించిన పోలీసులు


మల్లేశ్వరితో ప్రియుడు నాగబాబు, వారి కుమార్తె (ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక వనచర్ల వీధికి చెందిన శ్రీపతి మల్లేశ్వరి (24)ది హత్యేనని పోలీసు దర్యాప్తులో తేలింది. రెండు వారాలుగా సాగుతున్న ఈ కేసు చిక్కుముడి చివరికి వీడింది. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి లోతుగా దర్యాప్తు చేసి హత్య కోణాన్ని వెలికి తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం డీఎస్పీ అంబికా ప్రసాద్ వివరించారు. ఆయన కథనం మేరకు.. నాగబాబు, మల్లేశ్వరిలకు గతంలో వేర్వేరుగా పెళ్లిళ్లు జరిగాయి. నాగబాబు భార్యను, మల్లేశ్వరి భర్తను వదిలేసి వీరిద్దరూ స్థానిక వనచర్ల వీధిలో సహ జీవనం సాగించారు. వీరికి రెండున్నరేళ్ల కుమార్తె కూడా ఉంది. మల్లేశ్వరి వేరే వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో ఆమెను నాగబాబు తరచూ మద్యం తాగి వేధించేవాడు. ఐదేళ్ల కిందట అమలాపురంలో నాగబాబు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నప్పుడు అందులో పనిచేసే ఓ వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందన్నది నాగబాబు అనుమానం.

హత్య చేసిందిలా..

ఈ నెల 7వ తేదీ రాత్రి నుంచి మల్లేశ్వరి కనిపించకపోవడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత అమలాపురం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. తర్వాత 9వ తేదీ ఉదయం అమలాపురం బైపాస్ రోడ్డులో శ్మశానం వద్ద పంట కాలువ నీటి అంచున మల్లేశ్వరి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడాన్ని స్థానికులు, పోలీసులు గుర్తించారు. 7వ తేదీ రాత్రి వనచర్లవారి వీధిలోని వారున్న ఇంట్లోనే మల్లేశ్వరి మెడకు చీరను బిగించి నాగబాబు హత్య చేశాడు. అతనికి ఆ ఇంటి యాజమాని కుమారుడు కముజు నరసింహం సహకరించాడు. అప్పటికే చనిపోయిన మల్లేశ్వరికి ఒంట్లో బాగోలేదని.. ఆస్పత్రికి తీసుకు వెళుతున్నామని ఇరుగు పొరుగు వారికి చెప్పి నాగబాబు, నరసింహం ఇద్దరూ మోటారు సైకిల్‌పై ఆమె మృతదేహాన్ని తీసుకు వెళ్లారు. పంట కాలువ వద్దకు వెళ్లి మృతదేహాన్ని పడేశారు. మృతదేహం కాలువలో కొట్టుకుపోయి సముద్రంలో కలిసిపోతుందని వారు అంచనా వేశారు. అయితే ఆ మృతదేహం కాలువ నీటి అంచునే ఆగిపోవడంతో వారి పథకం నెరవేరక ఆనక వారి కుట్ర బయటపడింది. పోస్టుమార్టం నివేదిక వస్తేనే గాని అది ఆత్మహత్యా... హత్యా అనేది ఇప్పుడే చెప్పలేమని అప్పట్లో పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదికలో మల్లేశ్వరిది హత్యేనని తేలడంతో పోలీసులు ఈ కేసును హత్య కేసుగా మార్చి ఆ దిశగా దర్యాప్తు చేశారు. నిందితుడు నాగబాబు, సహకరించిన నరసింహంలను అరెస్ట్ చేసి ఆదివారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ దుర్గాశేఖరరెడ్డి తెలిపారు.

భారీ వాహనాలకు నో ఎంట్రీ

- రోడ్ కం రైలు వంతెనపై లారీలు, బస్సులకు బ్రేక్
- రెండు, మూడు చక్రాల వాహనాలు, కార్లకు అనుమతి
- గామన్ బ్రిడ్జి మీదుగా భారీ వాహనాల రాకపోకలు


కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద బారికేడ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/కొవ్వూరు: రాజమహేంద్రవరం– కొవ్వూరును అనుసంధానిస్తూ ఉన్న రోడ్ కం రైలు వంతెనపై ఆదివారం నుంచి లారీలు, బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు కలెక్టర్ మాధవీలత ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రోడ్ కం రైలు బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తరువాత 1974 నుంచి అన్ని వాహనాల రాకపోకలు జరిగాయన్నారు. ఈ బ్రిడ్జి జీవిత కాలం 65 ఏళ్లుగా నిర్ణయించారని, ఇది అందుబాటులోకి వచ్చి 49 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. రోజు రోజుకూ విపరీతమైన పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో బ్రిడ్జి డెక్ జాయింట్‌లు దెబ్బతింటున్నాయన్నారు. వంతెన భద్రత దృష్ట్యా ఆర్‌అండ్‌బీ అధికారుల సూచనల మేరకు లారీలు, బస్సులు తిరగడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. వంతెన మరిన్ని సంవత్సరాల పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధానంగా టూ వీలర్స్, మూడు చక్రాల వాహనాలు, కార్లు తిరిగేందుకు చర్యలు తీసుకున్నామని మాధవీలత పేర్కొన్నారు. ఈ వంతెన మీదుగా 10.2 టన్నుల బరువు మించి ఉన్న వాహనాలు తిరిగితే వంతెన దెబ్బతినే అవకాశం ఉందని 2007, 2011లలో నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిందని అన్నారు. ఈ దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరారు. అనుమతించిన వాహనాలు మాత్రమే వంతెనపై నుంచి తిరిగేలా మధ్యలో పోల్స్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. కొవ్వూరు– రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణించే భారీ వాహనదారులు, బస్సులు జాతీయ రహదారిపై ఉన్న నాలుగు లైన్ల వంతెన గామన్ బ్రిడ్జి (4వ వంతెన) మీదుగా వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఇదిలా ఉంటే రోడ్డు కం రైలు వంతెన నుంచి లారీలు, బస్సులు, లోడు వాహనాలు వెళ్లకుండా కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద పట్టణ పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.

డెంగీతో ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ డెంగీతో మృతిచెందాడు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ముప్పరాజువారి పాలేనికి చెందిన బొట్ల వీరాంజనేయులు (31) తండ్రిని చంపిన నేరంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నెల 13న తీవ్ర కడుపునొప్పి, రక్తపు వాంతులతో బాధపడుతూండగా జైలు అధికారులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సిఫార్సు మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ 14న ఉదర సంబంధిత శస్త్ర చికిత్స చేశారు. నాటి నుంచి వైద్య సేవలు పొందుతూండగా వీరాంజనేయులు డెంగీ సోకి ప్రాణాలు కోల్పోయాడు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్


రౌతులపూడిలో పోలీస్ అవుట్‌పోస్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

రౌతులపూడి: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం రౌతులపూడిలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్టును ఆయన ప్రారంభించారు. దీనికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఇక్కడ పోలీస్ స్టేషన్ లేక సుదూర ప్రాంతాల్లో ఉన్న కోటనందూరు, తుని రూరల్, అన్నవరం పోలీస్ స్టేషన్లకు వెళ్లి ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సి వచ్చేదన్నారు. ఈ ఇబ్బందులను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఇక్కడ పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయించారన్నారు. ముఖ్యంగా విశాఖ మన్యం ప్రాంతాలకు దగ్గరగా ఉన్న ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక శక్తుల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయన్నారు. వీటిపై త్వరలోనే ఉక్కుపాదం మోపుతామని ఆయన తెలిపారు. పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు శాఖాపరమైన, కోర్టులకు సంబంధించి పలు పనులు మిగిలి ఉన్నాయని, వాటిని రెండు నెలల్లో పూర్తిచేసి పూర్తిస్థాయిలో స్టేషన్‌గా పరిగణిస్తామన్నారు. ప్రస్తుతం ఒక ఎస్సై, 14 మంది సిబ్బందితో పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉంటుందన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రసాద్ ప్రభుత్వంలోని పెద్దలకు, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ స్థానికంగా పోలీస్ స్టేషన్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అవసరమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇక్కడ తన సమక్షంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అన్ని వ్యవస్థల కంటే పోలీస్ వ్యవస్థ చాలా కీలకమైందని, ప్రజలంతా సహకరించాలని ఆయన సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కటారి అర్జునమ్మ, కాకినాడ జిల్లా అడ్మిన్ ఎస్పీ పి.శ్రీనివాస్, ఏపీఎస్పీ ఏఎస్పీ బి.సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు మహర్దశ

వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల వైద్య విభాగ సమన్వయకర్త మురళీకృష్ణ



కాకినాడ క్రైం: కనీవినీ ఎరుగని రీతిలో ఏకకాలంలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టడం సంచలనమని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల వైద్య విభాగ సమన్వయకర్త, కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణుడు యనమదల మురళీకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య విద్యకు మహర్దశ పట్టిందని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి కొత్తగా నిర్మిస్తున్న వాటిలోని ఐదు కళాశాలలలో 750 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతిచ్చిందని అన్నారు. కేంద్ర వైద్య మండలి నిబంధనలను అనుసరించి పదిహేను శాతం సీట్లు సెంట్రల్ పూల్‌కి కేటాయించాల్సి ఉందని, అయితే రాష్ట్ర విద్యార్థులు ఈ సీట్లు పొందడంలో ముందు వరుసలో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో చంద్రబాబు మంగళగిరి ఎయిమ్స్ తప్ప ఒక్క వైద్య కళాశాలను తీసుకురాలేకపోయారని గుర్తు చేశారు. అది కూడా విభజన హామీలలో వచ్చిందే తప్ప బాబు చేసిన కృషి ఏమీ లేదన్నారు. ప్రస్తుతం నూతన వైద్య కళాశాల రాకతో 375 ఎంబీబీఎస్ సీట్లు రూ.17 వేల వార్షిక ఫీజుతో భర్తీ కానున్నాయని, ఇది సామాన్యులకు అనుకూలించే అంశమని గుర్తు చేశారు. అలాగే ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో బోధించే అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టుల బోధనకు అవసరమైన అన్ని వసతుల ఏర్పాటుకు నూతన భవనాల నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. రెండవ ఏడాది నుంచి క్లినికల్స్ మొదలవుతాయని, అప్పుడు మాత్రమే అనుబంధ వైద్య శాలల అవసరం ఉంటుందని డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఇన్ని అనుకూలతల మధ్య ప్రతికూలతలు వెదుకుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించడం ఓ వర్గం మీడియాకు పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల సమీకరణ కోసం సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల కేటాయింపు వైద్య విద్య ప్రారంభం నుంచి ఉన్నదేనని తెలిపారు. కేవలం రూ.17 వేల వార్షిక మొత్తానికి కేటాయించే ప్రయోజనాలను వదిలేసి 375 సీట్లకు అధిక ఫీజులంటూ తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు.

రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుల ఎంపిక


రోప్ స్కిప్పింగ్‌కు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

తుని: స్థానిక శ్రీపకాష్ విద్యా సంస్థలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ పోటీలకు పిఠాపురం, జగన్నాథగిరి, వి.కొత్తూరు, ఎస్.అన్నవరం, తుని నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్ 11, 14, 17, 19 విభాగాల్లో బాలికలు, బాలురను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూలై 28, 29 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. రోప్ స్కిప్పింగ్ సంఘ గౌరవాధ్యక్షుడు కేఎస్ జాబేజ్, కార్యదర్శి బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశాంతకుమార్, శ్రీనివాస్, సాధన, వరలక్ష్మి, పరదేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన టీటీ పోటీలు


బహుమతులు అందుకున్న విజేతలతో విజయ్‌ప్రకాష్ తదితరులు

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఫ్యూచర్ స్టార్స్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.మోహన్‌బాబు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వి.భాస్కరరామ్ మాట్లాడారు. భవిష్యత్‌లో ఒలింపిక్స్‌కు టేబుల్ టెన్నిస్ అకాడమి నుంచి క్రీడాకారులు ఎంపిక కావాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన శ్రీప్రకాష్ టీటీ అకాడమీ నుంచి నాణ్యమైన క్రీడాకారులను తయారు చేయాలన్నారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీ నరసింహారావు, రామసీత, ప్రిన్సిపాల్ మూర్తి, రిఫరీలు రమణకుమార్, వేణుగోపాల్, బాలదుర్గారావు, ఆయా జిల్లాల నుంచి వచ్చిన 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–11 బాలికల విభాగంలో పూజిత, బాలుర విభాగంలో ఎస్.మోహిత్‌శ్రీకపీస్, అండర్–13 బాలికల విభాగంలో ఆరీఫ్‌సుల్తానా, బాలుర విభాగంలో అచ్యుత్ విశ్వనాథ్, అండర్–15 బాలికల విభాగంలో జి.సుష్మిత, బాలుర విభాగంలో ప్రత్యూష్, బాలుర డబుల్స్ విభాగంలో ప్రత్యక్ష్ అలెన్, అండర్–17 బాలికల విభాగంలో జి.సుష్మిత, బాలుర విభాగంలో సాయికార్తీక్, మహిళా విభాగంలో దర్శిక, పురుషుల విభాగంలో ఏడి మణికంఠ, మిక్స్‌డ్ డబుల్ విభాగంలో పి.శ్రీలక్ష్మి, చరణ్ కార్తీక్, మహిళా డబుల్స్ విభాగంలో అర్షియా, సుష్మిత, పురుష డబుల్స్ విభాగంలో మోహిత్‌శర్మ, వై.ఆనందరాజ్ విజేతలుగా నిలిచారు.